క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



గ్రామసభలో మాట్లాడుతున్న రాజు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రైతుబంధు మండల అధ్యక్షుడు కొత్తబలిజ రాజు అన్నారు. సోమవారం పీరంపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు సకల సాకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వీధిలో సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధిక, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, గ్రామస్తులు శ్రీనివాస్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్ధకమే మన శత్రువు

సమయం వృథా చేయొద్దు: డీఎస్పీ



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు రూరల్: మన బద్ధకమే మన మొదటి శత్రువని డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐనెల్లి శివారులో తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషి జీవితంలో పదో తరగతి అతిముఖ్యమైందన్నారు. బద్ధకాన్ని వీడి చురుగ్గా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ నర్సింహులు, సర్పంచ్ జగదీష్, ఉప సర్పంచ్ గోవింద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి



జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సమాఖ్య నాయకులు

అనంతగిరి: పసికందు మృతికి కారణమైన వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బాధిత కుటుంబీకులతో కలిసి డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మహవీర్ ఆస్పత్రిపై విచారణ చేపట్టి, యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యులు సకాలంలో స్పందించి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదన్నారు. కార్యక్రమంలో ధారూర్ వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, రమేష్ నాయక్, రాజు నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో పేదలకు లబ్ధి

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: మండలంలోని ప్రజలు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గాజులగూడ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు కంటివెలుగు కార్యక్రమం వరం లాంటిదన్నారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ శిబిరంలో పరీక్ష నిర్వహించి అద్దాలను అందించడం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలు కంటి సమస్యలతో ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అనంత్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కొందుర్గు: దివ్యశక్తి పేపర్ పరిశ్రమ ఆధ్వర్యంలో సోమవారం కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కావలి యాదయ్య ప్రయాణికులకు నీరు పోసి చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం యాదయ్య మాట్లాడుతూ.. దివ్యశక్తి పేపర్ పరిశ్రమ నిర్వాహకులు ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటుచేసి తాగునీటిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ఆర్ శ్రీనివాస్, ప్రతినిధులు వెంకటేశ్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

- ముగిసిన ఉపాధ్యాయ ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, ఆర్డీఓలు

కొడంగల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 80 మంది ఉపాధ్యాయ, అధ్యాపక ఓటర్లు ఉండగా.. వారిలో 76 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఐ శంకర్, ఎస్ఐ రవిగౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పరిగిలో 97శాతం..

పరిగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. పట్టణ కేంద్రంలోని నంబర్ 1ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహించారు. ఈ కేంద్రం పరిధిలో మొత్తం 273 ఓట్లు ఉండగా.. అందులో 162 పురుషులు, 71మహిళల ఓట్లు ఉన్నాయి. అందులో 266 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. 97శాతం పోలింగ్ నమోదయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

దోమలో 100శాతం

దోమ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 47 మంది ఉపాధ్యాయ ఓటర్లుగా ఉండగా.. అందులో 34 మంది పురుషులు, 13 మంది మహిళలు ఉన్నారు. వీరందరూ ఓటు వేయడంతో ఇక్కడ 100 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి విజయేందర్ తెలిపారు. పోలింగ్ సరళిని పరిగి సీఐ వెంకటరామయ్య పరిశీలించారు.

నవాబుపేటలో..

నవాబుపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 50 ఓట్లు ఉండగా అందులో 48 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి సుమిత్రమ్మ తెలిపారు.



పరిగి: ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు

యాలాలలో 90 శాతం

యాలాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 62 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా.. సాయంత్రం 4 గంటల వరకు 56 మంది తమ ఓటును వినియోగించున్నారు. దీంతో 90 శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

ధారూరులో వంద శాతం..

ధారూరు: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీఓ విజయకుమారి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీడీఓ చంద్రశేఖర్, పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. ధారూరు కేంద్రంలో 29 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 13 మంది మహిళలు, 15 మంది పురుషులు తమ ఓటును వేశారు.

మోమిన్‌పేటలో 98.28శాతం

మోమిన్‌పేట: మోమిన్‌పేట పరిధిలో 58 ఓట్లు ఉండగా.. 57మంది తమ ఓటు వేశారు. దీంతో 98.28శాతం పోలింగ్ నమోదయింది. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ విజయకుమారి పరిశీలించారు.

పెద్దేముల్‌లో 100 శాతం..

పెద్దేముల్: మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ పరిధిలో 23 మంది ఓటర్లు ఉండగా.. 17 పురుషులు, 6 మంది మహిళలు ఓటు వేశారని తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్ఐ రాజేందర్‌లు తెలిపారు.



ధారూరు: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

మర్పల్లిలో 95.5 శాతం

మర్పల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో ఉన్న 21 ఓటర్లకు గాను 20 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు.

బంట్వారంలో..

బంట్వారం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బంట్వారం, కోట్‌పల్లి మండలాలకు సంబంధించి 15 మంది ఓటర్లకు గాను 14 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



దోమ: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న పరిగి సీఐ వెంకటరామయ్య



పెద్దేముల్: ఓట్ల పెట్టెను సీజ్ చేస్తున్న ఎన్నికల అధికారి



బంట్వారం: ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

మట్టిలో మాణిక్యం కవయిత్రి మొల్ల

- తెలుగు జాతికే ఆమె గర్వకారణం
- మొల్ల జయంతిలో వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: తెలుగు జాతికి కవయిత్రి మొల్ల గర్వకారణమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. సోమవారం కవయిత్రి మొల్ల కళావేదిక సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో జరిగిన మొల్ల జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, కవయిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని కవయిత్రి తెలుగులోకి అనువదించారని తెలిపారు. మొత్తం ఆరు కండాలలో 138 పద్యాలతో ఉన్న రామాయణాన్ని కేవలం ఐదు రోజుల్లోనే మొల్ల రాసిందని చెప్పారు. కుమ్మరి కులంలో జన్మించిన ఆమె.. మట్టిలో మాణిక్యంలా తొలి తెలుగు రచయిత్రిగా మొల్ల మహిళా లోకానికి ఆదర్శనీయురాలయిందని కొనియాడారు. భారతీయ సాంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని నేటి తరం యువతీ యువకులకు కవులు తమ రచనల ద్వారా తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం కవయిత్రి మొల్ల కళావేదిక వ్యవస్థాపకులు వెంకట్ మాట్లాడుతూ తెలుగులో రామాయణాన్ని రచించి, శ్రీకృష్ణదేవరాయలకు తన పద్యాలను వినిపించి అష్టదిగ్గజ కవులను ఆలోచింప చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేస్తున్న భాషా పండితులకు, కవులకు, సాహితీ ప్రియులకు ఏటా కళావేదిక ఆధ్వర్యంలో మొల్ల సాహిత్య పురస్కారాలు అందజేస్తున్నామని వెల్లడించారు. సభ్యులు ప్రభుశంకర్, కవి చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్ చైర్‌పర్సన్ దీప తదితరులు

'ఆమె' లేనిదే లోకం లేదు..

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి: ఏపీఎం

పరిగి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆమె లేనిదే లోకం లేదనే విషయాన్ని సమాజానికి చాటి చెప్పాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక కోటను కేటాయించాయని, కావున వారికి విద్యపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

దోమ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, రుణాలను మహిళా సంఘాలు అందిపుచ్చుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని సర్పంచ్ యాదయ్యసాగర్ అన్నారు. దోర్నాల్‌పల్లిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా ఆర్థిక, రాజకీయపరమైన ఆలోచనలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ నారాయణ, అకౌంటెంట్ అంజమ్మ, బుక్ కీపర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

అమ్మ ఒక చైతన్య దీప్తి..

అనంతగిరి: అమ్మ ఒక చైతన్య దీప్తి అని వికారాబాద్ డైట్ ప్రిన్సిపాల్ రామాచారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డైట్‌లో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. మహిళలు తమ శక్తి సామర్థ్యాలతో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ఎదుగుతున్నారని చెప్పారు. అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బందెప్పగౌడ్, ఆచారి, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల బహిరంగ వేలం

షాబాద్: కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ భూములను మూడు సంవత్సరాల పాటు బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు దేవాదాయ-ధర్మాదాయ శాఖ పరిశీలకులు మధుబాబు, ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దేవాలయ ఆవరణలో సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి 26ఎకరాలు కౌలుకు వేలం పాట నిర్వహించామని చెప్పారు. బొబ్బిలిగామ గ్రామానికి చెందిన ఆవుల కిష్టయ్య, పర్వేద కిష్టయ్య, కొమరబండ గ్రామానికి చెందిన నారమోని వెంకటయ్యలు రూ.1లక్ష 95 వేలకు పాట పాడి భూములను దక్కించుకున్నారు. అలాగే, ఈ సంవత్సరం జాతరకు కొబ్బరికాయలు పూజ సామగ్రి విక్రయించేందుకు వేలం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన పెద్ది బాలయ్య రూ.37 వేల 5వందలకు కైవసం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూముల కౌలు, కొబ్బరికాయల ఆదాయం రూ.2లక్షల 32వేల 5 వందలు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి ఉగాది నుంచి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తామని చెప్పారు.



వేలం పాట నిర్వహిస్తున్న మధుబాబు, ఈఓ శ్రీనివాస్ తదితరులు

'ఆయుష్మాన్'తో ఆరోగ్య ధీమా

- 1,886 రకాల వ్యాధులకు చికిత్స
- రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం
- దేశంలో ఎక్కడైనా వైద్య సదుపాయం
- గ్రామాల్లో కొనసాగుతున్న అనుసంధాన ప్రక్రియ
- ఈనెల 31 వరకు ఈ కేవైసీకి అవకాశం

దౌల్తాబాద్: రాష్ట్రంలో ఇప్పటి వరకు ఆరోగ్య శ్రీ పథకం కింద రేషన్‌కార్డు ఉన్న వారికి ఉచితంగా రూ.2 లక్షల లోపు వైద్యం చికిత్స అందేది. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణలో కూడా అమలు చేయడంతో రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ రూ.5 లక్షల వరకు దేశంలో ఎక్కడైనా ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు పొందవచ్చు. ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీగా పిలుస్తున్నారు. ఈ కార్డు పొందాలంటే రేషన్‌కార్డు ఉన్న వారు ఈకేవైసీ చేయించుకోవాలి. గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కల్పించారు. సీఎస్సీ(కామన్ సర్వీస్‌సెంటర్)లో కొత్త రేషన్‌కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేస్తారు. ఏప్రిల్ నుంచి ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేస్తారు. జనవరి నుంచి ఈ ప్రక్రియను సీఎస్సీ సెంటర్ల ఆపరేటర్లు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఈ కేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉంది.

దేశంలో ఎక్కడైనా..

ఆరోగ్యశ్రీ కార్డుతో ఇంతకు ముందు కేవలం రాష్ట్రంలోనే వైద్యసేవలు చేయించుకునే అవకాశం ఉండేది. అది కూడా రూ.2 లక్షలోపే.. ఆయుష్మాన్ భారత్ కార్డుతో దేశవ్యాప్తంగా ఎక్కడైనా రూ.5లక్షల వరకు వైద్యం చేయించుకునే వెసులుబాటు కలిగింది. ఈ కార్డుతో 1,886 రకాల వ్యాధులకు చికిత్స చేయించుకోవచ్చు. ముఖ్యంగా కిడ్నీ, గుండె మార్పిడి, కాలేయ వ్యాధులు, మోకాలి చిప్ప మార్పిడితో పాటు అనేక రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మండల వ్యాప్తంగా 12వేల రేషన్‌కార్డులు ఉండగా.. ఇప్పటి వరకు 4,500 ఈకేవైసీ ద్వారా ఆయుష్మాన్ కార్డులకు నమోదు చేయించుకున్నారు. కాగా ఈనెల 31 వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది.

ఈ కేంద్రాల్లో నమోదు

ఆయుష్మాన్ భారత్ కార్డులు రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా నమోదు చేసుకోవచ్చు. సీఎస్సీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్యమిత్ర లేదా ఏఎన్ఎంలు నమోదు చేస్తారు. వారికి రేషన్‌కార్డు, ఆధార్, ఫోన్ నంబరు వివరాలు చెబితే ఆయుష్మాన్ నమోదు చేస్తారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ కోసం నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా చౌదరిగూడ మండల కేంద్రానికి చెందిన ఆకారం నాగరాజు దేవాలయం నిర్మాణానికి అవసరమైన స్టీలు మొత్తాన్ని విరాళంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నాగరాజును అభినందించారు.

పల్లెల్లో పరుచుకున్న సిమెంటు రోడ్లు

అధ్వానంగా మారిన గ్రామీణ ప్రాంత రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలాల వారీగా విడుదలైన ఉపాధిహామీ నిధులతో ఇప్పుడు పల్లెల్లో కొత్తగా సీసీరోడ్లు పరుచుకుంటున్నాయి. దీంతో నిన్నమొన్నటి వరకు వాహనాలు కాదుకదా.. కనీసం కాలి నడకనా వెళ్లలేని దారులు కాస్త.. ఇప్పుడు సీసీరోడ్లతో తళతళా మెరుస్తున్నాయి.

- సీసీరోడ్ల నిర్మాణంతో గ్రామాలకు కొత్తకళ
- మండలానికి రూ.5.15 కోట్లు మంజూరు
- మెజార్టీ పల్లెల్లో కొనసాగుతున్న పనులు
- రోడ్ల నిర్మాణానికి సమయం సరిపోదంటున్న సర్పంచులు
- గడువులోగా పూర్తి చేయాల్సిందేనంటున్న అధికారులు

నవాబుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మెజార్టీ గ్రామాల్లోని ప్రధాన వీధులు, ఇళ్ల మధ్య రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతలమయంగా మారి.. వర్షం పడితే.. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయేది. దీంతో అస్తవ్యస్తమైన రవాణా సౌకర్యంతో గ్రామీణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. రహదారుల అధ్వానంతో పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలైన సందర్భాలు లేకపోలేదు. ఈ రోడ్లు ఎప్పుడు బాగు చేస్తారో.. మా సమస్యలు ఎప్పుడు తీరుస్తారో అని ఎదురు చూసిన పల్లెవాసులకు.. కొత్త రోడ్ల నిర్మాణంతో పరిష్కారం లభించినట్లయింది.

నిధులు మంజూరు..

మండలంలోని 32 గ్రామ సంచాయతీలు, రెండు అనుబంధ గ్రామాలకు కలిపి మొత్తం మండలానికి ఉపాధి హామీ నిధుల కింద సీసీరోడ్ల నిర్మాణాలకు, 67 పనులకు గానూ రూ.5.15 కోట్లు మంజూరయ్యాయి. ఫిబ్రవరి 18న సంబంధిత ప్రొసీడింగ్ పంచాయతీరాజ్ అధికారులకు చేరింది. ఏ గ్రామానికి ఏఏ పనులు, ఎన్ని నిధులు, వాటి ప్రొ సీడింగులను అధికారులు సర్పంచులకు అప్పగించారు. దీంతో పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



నారెగూడలో ఇటీవల నిర్మించిన సీసీరోడ్డు

గడువు పెంచాలి..

సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల కావడం సంతోషమే కానీ.. అతి తక్కువ సమయంలో రోడ్లను పూర్తి చేయాలనడం సరికాదని పలువురు సర్పంచులు వాపోతున్నారు. ఫిబ్రవరి 18న జిల్లా అధికారులకు ప్రొసీడింగ్ ఇచ్చి, మార్చి 15 లోపు పనులు ప్రారంభించి పూర్తి చేయాలనడంతో సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. అన్ని గ్రామాల్లో ఒకే సారి పనులు ప్రారంభం కావడం వలన సీసీ వేసే యంత్రాలు, కూలీలు ఎక్కడి నుంచి తీసుకురావాలని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరో నెల రోజుల గడువు ఇస్తే పనులు అన్ని పూర్తి చేయడానికి వీలవుతుందని కోరుతున్నారు. ఇదేలా ఉంటే అధికారులు మాత్రం కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు పనులు పూర్తి చేయాల్సిందే నంటూ పంచాయత్‌రాజ్ అధికారులు పేర్కొనడం గమనార్హం. లేని పక్షంలో వచ్చిన నిధులు రద్దు అయ్యే అవకాశం ఉందని నవాబుపేట పంచాయతీరాజ్ ఏఈ లక్ష్మయ్య తెలిపారు.

సీసీరోడ్ల పనులు ముమ్మరం

మర్పల్లి: ఉపాధిహామీ పథకం కింద గ్రామాలకు మంజూరైన సీసీరోడ్ల పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం సీసీ పనులు ఈ నెల 15 వరకు పూర్తి చేయాలనడంతో నిర్మాణ పనులు వేగిరం చేశారు. మండల పరిధిలోని వీర్లపల్లి గ్రామానికి సీసీ వేసేందుకు రూ.15 లక్షలు, ఎమ్మెల్యే నిధుల కింద మరో రూ.5 లక్షలు మంజూరు కావడంతో స్థానిక సర్పంచ్ రోడ్లు వేయిస్తున్నారు. పెద్దాపూర్ గ్రామానికి రూ.15 లక్షలు మంజూరు కావడంతో సర్పంచ్ ఉమారాణి సోమవారం పనులు ప్రారంభించారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉమారాణి

మాట తప్పిన కేంద్ర ప్రభుత్వం

- ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి
- ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ

యాలాల: అధికారంలోకి రాగానే వంద రోజుల్లోగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం మాటతప్పిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ ఆరోపించారు. ఈనెల 8న దౌల్తాబాద్‌లో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ పాదయాత్ర.. సోమవారం యాలాల మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందని మండిపడ్డారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌కుమార్, ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్, ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి నర్సింహులు, డప్పు మహేందర్, డప్పు నర్సింహులు, సందగళ్ల శ్రీనివాస్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ నాయకుల పాదయాత్ర

చెన్నకేశవరెడ్డి గెలుపు ఖాయం

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

యాలాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి గెలుపు ఖాయమని ఆ సంఘం యాలాల మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. సోమవారం ఎన్నికల అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూది కీలకపాత్ర అని, రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సంఘం అభ్యర్థికి మద్దతుగా నిలిచిన ఉపాధ్యాయులకు, పండిట్‌లకు, సీఆర్‌టీలకు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, సంఘం ప్రతినిధులు మొగులయ్య, పరమేశ్, మహమూద్, రాఘవేందర్‌జోషి, మోహిన్, షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు